నివృత్తి చేశారా మీ పుణ్యమా అని లేని పోని అపోహాలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలంటే కలలు గనడం, ఆశాసౌధాలు కట్టడం 'వగైరా' అన్నీ మానేసి మా పని మేం చేసుకుంటూ హాయిగా నిద్ర పోతాము. బాబూ! మీరు కర్మయోగం, కర్మ సన్యాసయోగం - రెండూ అవలంబిస్తున్నట్లుంది. ఎలా సాధ్యమవుతోంది స్వామీ మీకిది?"

'ఓస్ యింతేనా. ఆ రెండు యోగాల్లోనూ ఏది మంచిదని అర్జునుడూ అడిగేడు. కాని ఆ కాల, యుద్ధ వాతావరణాల్లో కృష్ణుడుకూడా యిదమిత్థమని తేల్చలేకపోయాడు. మేం మా గీతను కార్యరూపంలో ఉంచిన వాళ్ళముపడం చేత యిట్టే గ్రహించాము. ఇదే మా కీలకం. ఇంతకష్టపడి యింతదూరంవచ్చి, లక్ష్మీ కటాక్షం లేకుండా సామాన్య దుర్లభమైన మా పదవీ పీఠం దగ్గరకు వచ్చి యింతగా అడిగి శ్రద్ధతో తెలుసుకొన్న సామాన్యుడీనాటివరకూ లేడు. నీ వేదో తెలివైన వాడివిలా ఉన్నావు. మాకూ నీకూ గూడా సులువు చేసి పెట్టేవు. కనుక నీ కా కీలకం చెప్పేస్తున్నా విను. బాగా జ్ఞాపకం ఉంచుకో. శక్తి ఉంటే కార్యరూపంలో పెట్టు. స్వార్థానికైతే కర్మయోగం శ్రేయోదాయకం. పరులకై కర్మ సన్యాసయోగం గొప్ప స్వర్గగామి. తెలిసిందా."

"తెలిసింది. ధన్యుణ్ణయాను. ఇల్లాంటి పరమ సత్యాలు, అమృతభాష్యాలు, గొప్పోపదేశ వ్యాఖ్యలువిన్నాను! స్వామీ, ఇకవుంటా నాయనా. సెలవు' అంటూ ఇవతలకివచ్చి సన్యాసి నెత్తి మీద మొత్తుకుంటూ 'అయ్యో భగవంతుడా. శ్రీ పాలన బంధిఖానాలో యిలా ఉండవలసిందే? ప్రభూ! భక్తితో రామదాసులా మేం పాడే పాట విను. ఒక్కటే కోరిక. యీ అధికారులను కూర్చి ఒక్కటే మొర.

"ఎందుకయ్యా యిట్టివారు కదంలోనూ
సాగనంపు సత్వరమ్మె రామచంద్రా!"

కలపూర్తయింది. తెలివి వచ్చింది. పాట మాత్రం చెవుల్లో గింగురుమంటోంది నిజంగా జరిగినట్లు. నేటి సామాన్యులందరి నినాదం ఇదే. ఆ విముక్తి గీతమే.

# పౌరసత్వం

అంగర సూర్యారావు

విద్యాలయాన్ని విడిచి బయటకు వచ్చాడు అతడు. బంధుమిత్రులు అతనికి అఖండమైన స్వాగతం యిచ్చారు. అతడు గృహప్రవేశం చేశాడు. అంటే అతనిప్పుడు తన గ్రామంలో ఒక పౌరుడు: కాదు తన రాష్ట్రంలో ఒక పౌరుడు: కాదు తన దేశంలో ఒక పౌరుడు: ఉహూఁ! కాదు ప్రపంచంలో ఒక పౌరుడు. మొదటి రెండు రోజులూ స్వగృహంలోనే హాయిగా గడిపాడు. మూడవరోజునుండే గ్రామంలో తిరగటం ప్రారంభించాడు. ఎక్కడచూచినా అతనికి ఆశ్చర్యకరమైన విషయాలే కనిపించినవి. అతని సంచారంలో ఒకనాడు ఒకగుంపును చూశాడు. గుంపులో కలిసి కూర్చున్నాడు. కొంతసేపటికి అది అతనికి ఒక కూలీసభ అని అర్థమయింది. వారి ఉపన్యాసాలనుబట్టి వారికి రెక్కాడినరోజునే డొక్కాడుతుందని తెలుసుకున్నాడు, అయితే మానవ సమాజంలో యిదొక తరగతి ఉందా అనుకున్నాడు. ఆ స్థలాన్ని విడిచి ముందుకు నడిచాడు.

ఒకచోట ఒకవ్యక్తి కొద్దిమంది జనాన్ని కూర్చోబెట్టి ఏదో బోధిస్తున్నాడు. అతడు వారిలో కలిసి కూర్చున్నాడు. 'మనం మన కర్తవ్యాన్ని విస్మరించి కూర్చున్నట్లయితే మనల్ని అధః పాతాళంలోకి త్రొక్కివేస్తారు. మన మందరం బద్ధకంకణులమై మన మతాన్ని పూర్వౌన్నత్యానికి తీసుకురావాలి...' యిక అతడు ఆ ఉపన్యాసాన్ని వినలేకపోయాడు. ఒకేచోట పుట్టి ఒకే చోట పెరిగి ఒకరి కష్టసుఖాలను ఒకరు పంచుకుంటూ హాయిగా పురోభివృద్ధిని పొందుతున్న మానవసమాజంలో చీలికలా! కొందరు వ్యక్తులు తమ స్వార్థానికి పౌరులరక్తాన్ని ప్రవహింప చేస్తున్నారా! మత మాఢ్యం, జాత్యహంకారం ప్రపంచమంతటా దినదినాభివృద్ధి పొందటానికి

కారణంయేమిటి? ప్రపంచం పురోగమిస్తున్నదా? తిరోగమిస్తున్నదా? తిరిగి యీ లోకం శిలాయుగంలోనికి వెడుతున్నదా?-ఈ పౌరజీవితం యింత నికృష్టనదా అని నిట్టూర్చాడతడు.

ఇక రాజకీయవాదులవైపు తన దృష్టిని సారించాడు. రకరకాల రాజకీయ సంఘాలు: ప్రతి సంఘంలోనూ లెఖ్ఖలేనన్ని చీలికలు. ఒకరిని చూస్తే మరొకరికి ఈర్ష్య, ద్వేషం. తమ స్వార్థం కోసం యెటువంటి దౌర్జన్యానికైనా వెనుదియ్యరు. అందులో అభ్యుదయవాదులకు సరైన స్థానం లేదు. రాజకీయరంగంలో ప్రముఖపాత్రను నిర్వహిస్తున్న వారు ధనాఢ్యులు: వారి అనుయాయులు నిఋపేదలు. రంగంలోకి అడుగువెయ్యలేక 'మా భవిష్యత్తు మీపైన ఆధారపడిఉన్నదా?' అన్నట్లు మ్లానవదనంతో వారివైపు చూస్తున్నాడు సామాన్యుడు. రాజకీయాలనుండి తన దృష్టిని మరల్చి అతడు యింటికి దారితీశాడు.

ఇంటిలోనూ అతనికి శాంతి లభించలేదు. అతడిప్పుడు విద్యార్థికాదు. ఒకపౌరుడు: అతడు నిర్వహించవలసిన బాధ్యతలెన్నో ఉన్నవి. వాటిలో ముఖ్యమైనది కుటుంబ పోషణ. అతడు ఒక సామాన్య కుటుంబీకి. హాయిగా కాలం గడపడానికి అతను పెట్టిపుట్టలేదు. తండ్రిని వృద్ధాప్యం చాలావరకూ ఆక్రమించినది. ఇక తాను ఆయనకు విశ్రాంతినివ్వాలి. ఉద్యోగం కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. ఖాళీలున్నవన్న ప్రతిఉద్యోగానికీ దరఖాస్తుపెట్టాడు. వందలకొద్దీ ఉత్తరాలు ఖర్చయినవి. ఒకదానికీ సమాధానంరాలేదు. సిఫార్సు ఉంటేనేకాని ఈ రోజులలో ఉద్యోగంరాదని ఒక మిత్రుడు అతనికి తెలియజేశాడు. నిస్పృహతో ఉద్యోగ ప్రయత్నాన్ని విరమించాడు.

తల్లిదండ్రులు అతనికి ఒకసహచరిణి ఉండటం అవసరమని నిశ్చయించారు. మూడువేల రూపాయల కట్నంతో పిల్లనిస్తామని ఎవరో బంధువులు వచ్చారు. అతనికి చాలా ఆశ్చర్యంవేసింది. జీతం భత్యంలేని ఒక నౌకరుతోపాటు మూడు వేలరూపాయలుకూడా యిస్తారట.తనకు సంతోషమైనప్పుడు ఆమెను భూషించవొచ్చు, కోపంగా వున్నప్పుడు ఆమెను దూషించవచ్చు. ఆమెపై సర్వాధికారాలు యిక తనవి.

అతడు విద్యార్థిదశలో నున్నప్పుడు పౌరజీవితంపై ఎన్నో కలలుకన్నాడు. అది స్వేచ్ఛా జీవితం అనుకున్నాడు. కాని అడుగుపెట్టేసరికి అది ఎంతో నికృష్టజీవితంగా కనిపించింది. ఇంతకంటే తన విద్యార్థిజీవితమే యెన్నోరెట్లు నయం అనుకున్నాడు. కులమత విభేదాలకు తావులేని జీవితమది. ధనవంతులు, నిర్ధనులు అన్నమాటకు అర్థమేలేదక్కడ. తాపీగా కూర్చుని రాజకీయ విషయాలపై జల్లలు గుద్ది వాదించుకొనేవారు. ఉత్తరక్షణంలోనే అన్నీ మరచిపోయి జట్టాపట్టాలువేసుకొని తిరిగేవారు. ఏవిధంగా చూచినా అతనికి పౌరజీవితంకంటే విద్యార్థిజీవితమే ఉత్కృష్టమైనదిగా కనిపించినది. ఇక అతడు పౌరుడుగా నివసించలేకపోయినాడు. తిరిగి తన విద్యార్థిజీవితంలోనికి పయనమయాడు. కానీ వెంటనే ఏదో బలవత్తరమైన శక్తి అతనిని తిరిగి కాలవాహినిలోనికి విసరింది. మొదట మునిగి తరవాత తేలి అతడు కాలవాహినిలో కొట్టుకుపోనారంభించాడు.


## ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:



1907)

జారీచేసి చందావేయబడిన

| | | |
|---|---|---|
| మూలధనం | రూ. | 72,00,000 |
| అడిగిన మూలధనము. | రూ. | 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. | 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్
వ్యవహారాలు చేయబడును.

యన్ గోపాల అయ్యర్,
కార్యదర్శి.